# కరువు కాటేసింది.. కష్టం నేలపాలైంది

- అడుగంటిన భూగర్భ జలాలు
- నీరందక నెర్రెలు వారుతున్న పొలాలు
- నీరు అంతంతే.. నిరాశలో రైతు
- పంటను కాపాడుకోలేక అన్నదాత ఆందోళన
- అడుగంటిన చెరువులు, కుంటలు
- గొర్రెలు, మేకలకు మేతగా మారుతున్న వరి

మెదక్, మార్చి 14 (నమస్తే తెలంగాణ): మెదక్ జిల్లాలో కరువు పరిస్థితులు ఆందోళనకరంగా మారుతున్నాయి. భూగర్భజలాలు ఇంకిపోయి యాసంగి పంటలు ఎండిపోతున్నాయి. పొట్ట దశలో ఉన్న వరి పైర్లు కండ్ల ముందు ఎండిపోతుంటే రైతు కన్నీరు పెడుతున్నాడు. నెల రోజుల్లో చేతికొచ్చే దశలో ఉన్న వరి పొలాలు జీవాలకు మేతగా మారుతున్నాయి.



శివ్వంపేట: గూడురులో బోరు వేస్తున్న రైతు మంగపురం యాదగిరి

## ముదురిన ఎండలు

ఏప్రిల్ రాక ముందే ఎండలు ముదురుతున్నాయి. మెదక్, నర్సాపూర్, తూప్రాన్, శివ్వంపేట్, వెల్దుర్తి, కొల్చారం, నిజాంపేట్, రామాయంపేట, హవేళీఘనపూర్, పాపన్నపేట మండలాల్లోని గ్రామాల్లో భూగర్భజలాలు అడుగంటాయి. ఎక్కువ శాతం బోరుబావుల కింద పంటలు సాగు చేస్తున్నారు. అవి అడుగంటడంతో వరి పొలాలు ఎండుముఖం పడుతున్నాయి.

## రైతు ఆశలపై దెబ్బ..

చెరువులు, కుంటలు జలకళను సంతరించుకోవడంతో రైతులు యాసంగిపై ఆశలు పెంచుకున్నారు. సన్నాలు వేస్తే బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో వరి సాగు వైపు మొగ్గు చూపారు. మార్చిలోనే ఎండలు ముదరడంతో భూగర్భ జలాలు అడుగంటాయి. బోర్లలో నీరు ఇంకిపోతున్నది. పంటకు సరిపడా నీరందించలేక రైతులు అల్లాడుతున్నారు. కొందరు అప్పు చేసి బోర్లు వేయిస్తున్నారు. నీరు పడక దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. చేసేదేమీ లేక పొట్ట దశలో నెర్రెలు వారిన చేనులో పశువులను మేపుతున్నారు.

## శివ్వంపేటలో..

శివ్వంపేట, మార్చి 14: శివ్వంపేట మండలం గూడురు గ్రామానికి చెందిన రైతు మంగపురం యాదగిరి తన మూడెకరాల పొలాన్ని ఎలాగైనా కాపాడుకోవాలని అప్పులు చేసి మరీ కొత్త బోరు వేశాడు. ఆఫ్ ఈంచ్ నీరు మాత్రమే పడింది. దీంతో ఆ రైతు నిరాశ చెందాడు. తన వరి పొలాన్ని కాపాడుకునేదెట్లా అని దిగాలు చెందాడు. పొట్టదశలో ఉన్న పంటను ఎలాగైనా కాపాడుకోవాలని శుక్రవారం బోరు వేయించాడు. అనుకున్నంత నీళ్లు పడకపోవడంతో నిరాశచెందాడు.

## నీరందక ఎండుతున్న పొలాలు



చిలిపిచెడ్: బోర్ మోటర్‌ను చూపుతున్న రైతు నర్సింహులు

చిలిపిచెడ్, మార్చి 14: చిలిపిచెడ్ మండలం మీదుగా మంజీరా నది వెళ్తున్నా.. ఈ ప్రాంతంలోని బోర్లలో భూగర్భ జలాలు తగ్గాయి. దీంతో చేతికి రావాల్సిన పంట ఎండుతున్నది. చిలిపిచెడ్‌కు చెందిన రైతు కర్రోళ్ల లక్ష్మణ్ తనకున్న ఆరేకరాల్లో ఐదు చోట్ల బోర్లు ఉన్నా సరిపడా నీరు పోయక పంట పూర్తిగా ఎండుతున్నది. పంటను కాపాడుకుందామని మరో రెండు బోర్లు వేశాడు. ఒకటి 600 ఫీట్లు, మరొక్కటి 350 ఫీట్లు వేసినా ఫలితం లేదు. దీంతో రూ.3 లక్షల అప్పు అయ్యింది.

## అయోమయంలో అన్నదాతలు

చిన్నశంకరంపేట, మార్చి14: మండలంలోని వివిధ గ్రామాల్లో భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో వేసిన పంటలు ఎలా కాపాడుకోవాలో తెలియక అన్నదాతలు అయోమయంలో పడ్డారు. పంటలను కాపాడుకోవడానికి రైతులు నానా తంటాలు పడుతున్నారు. కొంత మంది బోరుబావులు తవ్వుతున్నారు. 500 ఫీట్లు వేసినా నీళ్లు రాక అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. పంట పొట్టదశలో ఎండిపోవడంతో పశువుల మేతకు వేస్తున్నారు.



చిలిపిచెడ్: చిట్కుల్‌లో ఎండిన వరి పంటను వేస్తున్న గొర్రెలు



చిలిపిచెడ్: మరమ్మతుల కోసం మోటర్ బయటకు తీస్తున్న రైతులు

## ఎండుతున్న పంటలు

మెదక్‌రూరల్, మార్చి 14: మెదక్ మండలంలోని మల్కాపూర్, శివ్వాయిపల్లి, గుట్టకిందిపల్లి తదితర గ్రామాల్లో భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. దీంతో పొలాల్లో పశువులను మేపుతున్నారు. పంట చేతికి రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

### బోర్లు వేయించుకోవడానికి ముందుకొస్తలేరు

జిల్లాలో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. దీంతో రైతులు ఎవరూ బోర్లు తవ్వించుకోవడానికి ముందుకొస్తలేరు. దీంతో వ్యాపారాలు లేక ఇబ్బందులు పడుతున్నాం. లక్షలు ఖర్చు చేసి బోరు బండిని తీసుకున్నాం. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. పంటకు పెట్టిన పెట్టుబడి ఎలా వస్తుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

**- అనిల్‌గౌడ్, బోరు బండి యజమాని, మెదక్**

### లాగోడికి కూడా వచ్చేటట్టు లేదు



కొల్చారం, మార్చి 14: అయిదున్నర ఎకరాల్లో నాటేసినం. యిప్పుడు రెండున్నరెకరాలు ఎండిపోయింది. నాట్లేసేటప్పుడు మంచిగా బోర్లు పోసినయి. ఇప్పుడు ఏం పోస్తలేవ్. ఏం చేతికొచ్చేటట్టు లేదు. మా పరిస్థితి లాగోడికి కూడా వచ్చెటట్టు లేదు. కరెంటు ఎప్పుడంటె అప్పుడు పోతున్నది. ఎప్పుడోస్తదో తెల్వదు. ఈ ఎండలకు మోటర్లు గరమై కాలిపోతున్నయి. నీళ్లందక పొలం నెర్రలవు వారింది. పెట్టిన పెట్టుబడి కూడా మునిగినట్టే.

**- వీరయ్య, రైతు, కొల్చారం**

### ఎండిన పంటకైనా సాయం చేయుండ్రి సారూ

నిజాంపేట, మార్చి 14: యాసంగి సీజన్ మొదట బోరు మంచిగా పోయింది. ఈ నీళ్లను చూసి నాలుగు ఎకరాల్లో వరి ఏసిన. గిప్పుడు బోరు నుంచి నీళ్లు అచ్చుడు తక్కువైంది. సరిగ్గా నీళ్లు అందక, దగ్గర దగ్గర 2 ఎకరాల వరకు వరి పూర్తిగా ఎండిపోయింది. చేసేది ఎంలేక ఎండిన పంటను వదిలేసిన. పంటకు పెట్టిన పైసలు అచ్చేటట్టు లేవు. ఎకరానికి రూ.20 వేలు వరకు నష్టం వస్తున్నది. ఎండిన పంటకైనా పరిహారంగా సాయం చేయుండ్రి సారూ..

**- స్వామి రైతు, నస్కల్, నిజాంపేట మండలం**

# జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్ అప్రజాస్వామికం

## బీఆర్‌ఎస్ మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 14: ప్రజా సమస్యలపై అసెంబ్లీలో గొంతెత్తిన మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేయడం అప్రజాస్వామికమని బీఆర్‌ఎస్ మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి శుక్రవారం మండిపడ్డారు. అసెంబ్లీలో జగదీశ్‌రెడ్డి మాట్లాడుతున్నప్పుడు కాంగ్రెస్ సభ్యులు అడ్డుతగులుతుంటే స్పీకర్ వారిని నియంత్రించలేకపోయారన్నారు. సమస్యలపై ప్రశ్నించిన వారి గొంతునొక్కే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ప్రజలు రేవంత్‌రెడ్డి ప్రభుత్వ తీరును గమనిస్తున్నారన్నారు. అక్రమంగా సస్పెండ్ చేసిన జగదీశ్‌రెడ్డిపై సస్పెన్షన్ ఎత్తేయాలని డిమాండ్ చేశారు.

# బందోబస్తు మధ్య పిడి గుద్దులాట



కొంతాన్‌పల్లి గ్రామంలో పిడి గుద్దులాటలో పాల్గొన్న గ్రామస్తులు

శివ్వంపేట, మార్చి 14: శివ్వంపేట మండలం కొంతాన్‌పల్లి గ్రామంలో ఏటా హోలీ పండుగ సందర్భంగా నిర్వహించుకునే పిడి గుద్దులాట ఆనవాయితీగా వస్తున్నది. గ్రామంలోని ఎస్సీ బుడగవర్గం వతందార్లు డప్పులతో ఘటం ఊరేగింపు చేస్తారు. గ్రామస్తులంతా కలిసి చావిడి వద్ద పిడిగుద్దులాట నిర్వహిస్తారు. తరతరాలుగా వస్తున్న సంప్రయదాయాన్ని గౌరవిస్తూ ఈయేడు ఘర్షణ వాతావరణం ఉండడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకుండా తూప్రాన్ సీఐ రంగకృష్ణ, శివ్వంపేట, తూప్రాన్, వెల్దుర్తి, మనోహరాబాద్ ఎస్సైలు, ఇతర పోలీసు బలగాలతో భారీ బందోబస్తు చేపట్టారు. వీరి ఆధ్వర్యంలో గ్రామస్తుల పిడి గుద్దులాట జరిగింది.

# ఘనంగా సంగమేశ్వర స్వామి జాతర

కౌడిపల్లి, మార్చి 14: హోలీ పండుగను పురస్కరించుకుని కొట్టాలలో శుక్రవారం సంగమేశ్వర స్వామి జాతరను ఘనంగా జరుపుకొన్నారు. ఉదయం స్వామికి ప్రత్యేక పూజలు చేసి ఆలయం చుట్టూ ఎడ్ల బండ్లను ఊరేగించారు.



# ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చుడెప్పుడో?

- రామాయంపేట మండల వ్యాప్తంగా 6144 దరఖాస్తులు
- 4077 మంది లబ్ధిదారులుగా గుర్తింపు
- ఇండ్ల నమూనా చూసి నిరాశ చెందుతున్న లబ్ధిదారులు





ప్రభుత్వం చూపిస్తున్న ఇందిరమ్మ ఇల్లు నమూనా

రామాయంపేట రూరల్, మార్చి14: కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్భాటంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇండ్లు రామాయంపేట మండల వ్యాప్తంగా ఎక్కడా నిర్మాణాలకు నోచుకోలేదు. మండలంలోని 15 పంచాయతీలు ఉన్నాయి. చాలా గ్రామాల్లో అర్హులను గుర్తించినా వారికి ఎలాంటి సర్టిఫికెట్లు ఇవ్వలేదు. పైలట్ ప్రాజెక్టుగా దామరచెర్వు గ్రామాన్ని ఎంపిక చేశారు. ఆ గ్రామంలో 337మంది దరఖాస్తు చేసుకోగా అందులోంచి 153 మందిని అర్హులుగా గుర్తించి 97 మందికి ప్రొసీడింగ్ కాపీలు ఇచ్చారు. ఇందులో ఏ ఒక్కరూ ఇప్పటివరకు ఇండ్ల నిర్మాణాలు చేపట్టలేదు. మండల వ్యాప్తంగా 6144 మంది ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకోగా ఇందులో 4077 మందిని అర్హులుగా గుర్తించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 400 నుంచి 500 చదరపు అడుగుల వరకు ఇల్లు నిర్మించాల్సి ఉంది. ఇందులో 2 బెడ్‌రూంలు, హాల్, టాయిలెట్, వంటరూం నిర్మించాలి. కానీ ఈ సర్కారు చూపెడుతున్న నమూనా ఇంటిని ఎవరూ ఇష్టపడటం లేదు. మరీ ఇంత అధ్వానంగా కడుతున్నరు, ఇది ఎంతకాలం ఉంటుంది అంటూ నిరాశ వ్యక్తం చేస్తున్నారు.

### ఆశ పెట్టి.. ఆవేదన మిగిల్చారు



ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకోవడానికి దరఖాస్తు చేసుకోవాలని ఎన్నో ఆశలు పెట్టిండ్రు. ఇల్లు కోసం దరఖాస్తు చేసినా నా పేరు రాలేదు. ఇల్లు కట్టుకునేందుకు సిద్ధంగా ఉన్నా. అన్ని అర్హతలు ఉన్నా నాకు మంజూరు కాలేదు. అధికారులను అడిగితే రెండో విడతలో చూద్దాం అంటున్నారు. ఆశ పెట్టి ఆవేదన మిగిల్చారు.

**- పసుల లక్ష్మి, దామరచెర్వు**

### గుడిసెలో ఉంటున్నా.. ఇల్లు రాలేదు



మా తండాలో చాలా కుటుంబాలు గుడిసెల్లో ఉంటున్నాయి. ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేశాం. కానీ ఇప్పటివరకు మంజూరుకాలేదు. అధికారులను అడిగితే రెండో విడతలో చూద్దామని చెబుతున్నరు. కానీ ఆ రెండో విడత ఎప్పుడో చెప్తలేరు.

**- రాంచందర్ నాయక్, దంతేపల్లి రాంచందర్ తండా**

### ఎవరికి ఇస్తారో.. చెప్తే మంచిగుంటది



గుడిసెల్లో ఉంటున్న మాకే ఇందిరమ్మ ఇల్లు ఇస్తలేరు. కానీసం ఎవరికి ఇస్తారో చెప్తే ఆశలు వదులుకుంటాం. తండాలపై ప్రభుత్వం దృష్టి పెట్టడం లేదు. మాలో ఆశలు నింపి కళ్లు కాయలు కాసేలా ఎదురు చూసే పరిస్థితి కల్పించారు. ఇచ్చిన మాట మీద నిలబడని ప్రభుత్వానికి గుణపాఠం చెప్తాం.

**- దేవీసింగ్, జమ్లా తండా**

# జగదీశ్వర్‌రెడ్డిని సస్పెండ్ చేయడం పిరికిపంద చర్య



నర్సాపూర్‌లో నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

నర్సాపూర్, మార్చి 14: మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డిని అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయడం పిరికి పంద చర్య అని బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు భిక్షపతి పేర్కొన్నారు. శుక్రవారం నర్సాపూర్‌లోని బస్టాండ్ సమీపంలో బీఆర్‌ఎస్ శ్రేణులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు భిక్షపతి మాట్లాడుతూ అసెంబ్లీలో నిజానిజాలు బయట పెడుతున్నాడనే ఉద్దేశంతో జగదీశ్వర్‌రెడ్డిని సస్పెండ్ చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని కుట్రలు, కుతంత్రాలకు పాల్పడుతుందో ప్రజలు గమనిస్తున్నారని వెల్లడించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు సత్యంగౌడ్, వైస్ ఎంపీపీ నర్సింగరావు, మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, నాయకులు నాగరాజుగౌడ్, సూరారం నర్సింహులు, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

# హోలీ.. చమ్మకేళి

- తెలంగాణ సంస్కృతికి నిదర్శనం హోలీ
- జిల్లా వ్యాప్తంగా హోలీ పండుగ సంబురాలు
- ఊరూరా కామ దహనాలు
- రంగులు చల్లుకున్న చిన్నారులు, మహిళలు



అల్లాదుర్గంలో హోలీ సంబురాల్లో పాల్గొన్న మహిళలు

**హోలీరె రంగ హోలీ చమకేళిరె హోలీ..** రంగ్ బరిసే రంగ్ బరిసే.. కామయ్యకు దోతులంటా ఓ లచ్చగుమ్మడి.. అంటూ ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ, పాటలు పాడుతూ ఆటలు ఆడుతూ హోలీ పండుగను శుక్రవారం వైభవంగా జరుపుకొన్నారు. వసంతంలో వచ్చిన తొలి పండుగ హోలీ. ప్రకృతిలో సహజ సిద్ధంగా లభించే మోదుగ పూలతో తయారుచేసుకున్న రంగులు చల్లుకున్నారు. పల్లె, పట్టణం, చిన్నాపెద్దా తేడా లేకుండా వీధుల్లోకి వచ్చి రంగులు చల్లుకుంటూ కేరింతలు కొట్టారు. రంగుల్లో మునిగి తేలారు. ఈ సారి గురువారం రాత్రి కామ దహనం నిర్వహించారు.

**- న్యూస్‌నెట్‌వర్క్, మెదక్, మార్చి 14**



మెదక్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలోని గిరిజన గురుకుల డిగ్రీ కళాశాలలో హోలీ ఆడుతున్న విద్యార్థినులు



మెదక్ కలెక్టరేట్‌లో హోలీ సంబరాల్లో అదనపు కలెక్టర్ నగేశ్



చేగుంట: కాముడిని దహనం చేస్తున్న పట్టణవాసులు



మెదక్ రూరల్: రంగులు చల్లుకుంటున్న చిన్నారులు



చేగుంట: హోలీ వేడుకల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు, యువకులు



చిన్నశంకరంపేటలో హోలీ సంబురాల్లో యువకులు



శివ్వంపేట: గూడురులో హోలీ సంబురాల్లో గ్రామస్తులు

## నేటి నుంచి ఒంటి పూట బడులు



మెదక్ మున్సిపాలిటీ, మార్చి 14: వేసవి దృష్ట్యా నేటి నుంచి అన్ని పాఠశాలల్లో ఒంటి పూట తరగతులు నిర్వహించాలని విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలల్లో ఈ నెల 15 నుంచి ఏప్రిల్ 23 వరకు ఒంటి పూట బడులు కొనసాగనున్నాయి. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు తరగతులు నిర్వహిస్తారు. ఆ తరువాత విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తారు. పదో తరగతి పరీక్షా కేంద్రాలు గల పాఠశాలల్లో మధ్యాహ్నం 1 నుంచి 5 గంటల వరకు పాఠశాలలు నిర్వహిస్తారు. పది పరీక్షలు ముగిసిన తరువాత ఉదయం పూట ఆయా పాఠశాలలు నడుస్తాయి.

## జాతీయ ఫుట్‌బాల్ పోటీలకు శరత్‌చంద్ర ఎంపిక



శరత్‌చంద్ర

రామాయంపేట, మార్చి 14: జాతీయ స్థాయి ఫుట్‌బాల్ అండర్ 14 పోటీలకు రామాయపేటకు చెందిన శరత్‌చంద్ర ఎంపికైనట్లు కోచ్ సత్యనారాయణ తెలిపారు. మహబూబ్‌నగర్‌లో జరుగుతున్న రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ అండర్ 14 పోటీలో వరంగల్ జట్టుపై మెదక్ జట్టు విజయం సాధించింది. ఈ విజయంలో శరత్‌చంద్ర మూడు గోల్స్ చేయడంతో విజయం వరించింది. శరత్‌చంద్ర జిల్లా, రాష్ట్ర స్థాయిలో రెండుసార్లు అవార్డులు పొందాడు.

## అనుమానాస్పదంగా యువకుడి మృతి



శేఖర్ (ఫైల్)

చేగుంట, మార్చి 14: అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందిన ఘటన చేగుంట పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పులబోయిన శేఖర్ (20) వడియారం రైల్వే బ్రిడ్జి సమీపంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. శేఖర్ మద్యం తాగి పడి ఉండవచ్చని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు చేగుంట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

## పెండ్లి కావడంలేదని..



శివరాజ్ (ఫైల్)

చిన్నశంకరంపేట, మార్చి 14: జీవితంపై విరక్తి చెందిన ఓ యువకుడు చెట్టు కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని మడూరులో శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం మడూర్‌కు చెందిన పిరంగళ్ల శివరాజ్ (24) పెండ్లి సంబంధాలు కుదరడం లేదని కొంతకాలంగా తీవ్ర మానసిక క్షోభకు గురవుతున్నాడు. బుధవారం రాత్రి పంటకు నీళ్లు పెట్టి వస్తానని పొలం వద్దకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోయేసరికి ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లి చూడగా చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. మృతుడి తండ్రి యాదగిరి ఫిర్యాదు మేరకు ఎస్సై నారాయణ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## భార్యపై భర్త దాడి.. కేసు నమోదు

కౌడిపల్లి, మార్చి 14: భార్యపై భర్త దాడి చేసిన ఘటన కౌడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని తిమ్మాపూర్‌లో శుక్రవారం జరిగింది. ఎస్సై రంజిత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. తిమ్మాపూర్‌కు చెందిన స్వాతిని హైదరాబాద్ సూరారంలోని రాజీవ్‌గాంధీ కాలనీకి చెందిన సున్నపు రమేశ్‌తో 10 ఏండ్ల క్రితం వివాహం చేశారు. ఐదేండ్ల పాటు వీరి దాంపత్య జీవితం సాఫీగా సాగింది. వీరికి ఇద్దరు సంతానం. చెప్పుడు మాటలు విని అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడు. గతంలో జీడిమెట్ల పోలీస్‌స్టేషన్‌లో పెద్ద మనుషుల సమక్షంలో కౌన్సెలింగ్ కూడా ఇచ్చారు. అయినా అతడిలో మార్పు రాలేదు. ఈ నెల 6న స్వాతికి కడుపు నొప్పి వచ్చింది. దీన్ని పరీక్షించిన వైద్యులు గర్భసంచిపై నీటి బుడగలు ఉన్నాయని చెప్పారు. అప్పటి నుంచి ఆమెకు వివాహేతర సంబంధం ఉందంటూ స్వాతిని భర్త కొడుతూ, తిడుతూ హింసిస్తున్నాడు. ఆమెను, పిల్లలను ఇంట్లో నుంచి వెళ్లగొట్టాడు. అప్పటి నుంచి స్వాతి తన తల్లిగారిల్లు తిమ్మాపూర్‌లోనే ఉంటున్నది. ఈనెల 13న రమేశ్ తిమ్మాపూర్‌కు వచ్చి ఇంటికి వెళ్దామని చెప్పాడు. అందుకు ఆమె అంగీకరించలేదు. మాట్లాడేది ఉందని గ్రామ సమీపంలోని హనుమాన్ గుడి వద్దకు తీసుకెళ్లాడు. అక్కడ ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో రమేశ్ స్వాతిని చంపుతానంటూ, తన వెంట తెచ్చుకున్న కత్తితో దాడి చేస్తుండగా, అటుగా వస్తున్న గ్రామస్తులు విడిపించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రంజిత్‌రెడ్డి తెలిపారు